క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతలకోన క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని ఆలయ ధర్మకర్త పి.నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతిపూజ, ఆకుపూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

12న షాపింగ్ కాంప్లెక్స్ గదులకు వేలంపాట

కమలాపురం : నగర పంచాయతీకి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని 7 గదులకు ఈనెల 12న వేలం పాట నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి 7 గదులకు వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొని గదులు దక్కించుకోవాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వేముల ఎస్‌ఐగా ప్రవీణ్‌కుమార్



వేముల : వేముల పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ధనుంజయుడు ప్రొద్దుటూరు టూ టౌన్‌కు బదిలీ అయ్యారు. దీంతో వేంపల్లెలో పనిచేస్తున్న పి.ప్రవీణ్ కుమార్‌ను వేములకు బదిలీ చేశారు. దీంతో ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు.

నిరంతర పోరాటం చేస్తున్న యూటీఎఫ్



జెండావిష్కరణలో పాల్గొన్న యూటీఎఫ్ నేతలు

జమ్మలమడుగు : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తోందని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్.నాగార్జునరెడ్డి, కార్యదర్శి మురళీకృష్ణలు తెలిపారు. శనివారం యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలైన సందర్భంగా స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో కేక్ కట్ చేసి జెండా విష్కరణ చేశారు. యూటీఎఫ్ రాబోయే రోజుల్లో తిరుగులేని శక్తిగా ఎదుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న రేషనలైజేషన్ నిలిపివేసి తల్లికి వందనం కార్యక్రమం కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మంచి అలోచన మంచి జీవితాన్ని ఇస్తుంది



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ హుసేన్‌పీరా

జమ్మలమడుగు : విద్యార్థులు మంచిఆలోచనలు చేస్తే మంచి జీవితాన్ని పొందుతారని డీఎస్పీ హుస్సేన్‌పీరా తెలిపారు. శనివారం షిర్డి సాయి జూనియర్ కాలేజీలో కరస్పాండెంట్ ఎన్. హైమావతి, ప్రిన్సిపాల్ సంజీవరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక మలుపు వంటిదన్నారు. ఈ మలుపులో సరైన నిర్ణయాలు, కష్టపడి చదువుకున్న వారు ఉన్నతస్థాయిని చేరుకుంటారన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని సూచించారు. కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, గోపాల్‌రెడ్డి, ఎస్ఐ కల్పన తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కడప అర్బన్: కడప నగరంలోని అప్సర సర్కిల్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మాసాపేటకు చెందిన ఉమామహేశ్వరరావు తన సొంతపనిమీద అప్సర సర్కిల్ వద్దకు వెళుతుండగా మధ్యలో పెట్రోల్ అయిపోయింది. దీంతో తన మోటార్‌సైకిల్‌ను పెట్రోల్ బంక్ వరకు తోసుకుని వెళుతుండగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సుఖవనం రాజు కెటిఎం బైక్‌పై వేగంగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. చికిత్సకోసం ఇరువురిని రిమ్స్‌కు తరలించారు.

కిలో గంజాయి స్వాధీనం

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో తారకరామానగర్‌లో గంజాయిని విక్రయిస్తున్న కృష్ణవేణి అనే మహిళను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ తిమ్మయ్య తెలియజేశారు. ఆమె వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వర్షాభావంతో దెబ్బతిన్న ఖరీఫ్ పంటలు

- ఎండిన వేరుశనగ, మినుము
- ట్రాక్టర్‌తో దున్నివేస్తున్న రైతులు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు



పంటలను ట్రాక్టర్‌తో దున్నివేస్తున్న రైతు



రైతులు దున్నివేసిన మినుము పంట పొలం

వేముల : ఈ ఏడు ఖరీఫ్‌లో ఎన్నో ఆశలతో పంటలు సాగుచేసినా రైతులకు నిరాశే మిగిలింది. ఖరీఫ్ సీజన్‌కు సకాలంలో వర్షాలు కురిసి భూములు పదును కావడంతో పంటలు సాగుచేశారు. అదునులో వర్షం పడటంతో జూన్ నెలలో రైతులు అప్పులు చేసి వేరుశనగ, మినుము పంటలను సాగుచేసుకున్నారు. సాగు అనంతరం పంటలు ఆశాజనకంగా కనిపించాయి. అయితే వరుణుడు మొహం చాటెయ్యడంతో పంటలు దెబ్బతిన్నాయి. పంటలు సాగుచేసి 50 రోజులు దాటినా వర్షాలు పడలేదు. పంటల సాగు కోసం వేలకు వేల రూపాయలు రైతులు పెట్టుబడులు పెట్టారు. పొలాలను బీడ్లుగా ఉంచితే సేద్యపు ఖర్చులు అదనంగా వస్తాయన్న ఉద్దేశంతో తక్కువ కాలవ్యవధిలో దిగుబడులు వచ్చే మినుము సాగు చేశారు. మినుములో దిగుబడులు అందాక రబీలో శనగ పంట సాగుచేయవచ్చనే రైతులు ఆదిశగా మినుము పంటను ఎంచుకున్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు పెట్టుబడులు పెరిగిపోతాయన్న ఉద్దేశంతో రైతులు మినుముపంటపైనే దృష్టి పెట్టారు. పంట సాగు చేశాక వర్షాలు లేక పంట ఎండుదశకు చేరింది.

ఎండిన పంటలను దున్నేస్తున్న రైతులు

మండలంలోని కొండ్రెడ్డిపల్లె గ్రామంలో ఖరీఫ్‌లో వేరుశనగ, మినుము పంటలను రైతులు సాగు చేశారు. గ్రామంలో 185 కరాల్లో మినుము, 45 ఎకరాల్లో వేరుశనగ పంటలను సాగు చేశారు. సాగు చేసి వర్షాలు లేక పంట ఎండిపోవడంతో ట్రాక్టర్లతో దున్నివేస్తున్నారు. సాగులో చేసిన పెట్టుబడులు మట్టిపాలయ్యాయని ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయం కలిసిరాక, వరుణుడు కరుణించక, పంటలు ఎండిపోవడంతో చేసేదేమీ లేక దున్నివేయడం వారికి కలచివేస్తోంది.

26 ఎకరాల్లో మినుము సాగు చేశా..



నాకు 26 ఎకరాల్లో మినుము పంట సాగు చేశా. ఖరీఫ్ సాగుకు పదునులో వర్షాలు పడ్డాయి. మినుము పంట సాగుచేసి 50 రోజులు దాటినా వర్షాలు పడలేదు. పంట ఎండిపోవడంతో ట్రాక్టర్‌తో 26 ఎకరాల్లో పంటను దున్నివేశా. ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి రూ.2లక్షలు మేర నష్టపోయా. పంటలు ఎండి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– మేకల కులశేఖర్‌రెడ్డి, కొండ్రెడ్డిపల్లె

మినుము, వేరుశనగ పంటలను దున్నివేశాను



ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము, వేరుశనగ పంటలను దున్నివేశా. నాకున్న 8 ఎకరాల్లో మినుము, 5 ఎకరాల్లో వేరుశనగ సాగుచేశాను. సాగుకు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. పంటలు సాగుచేశాక ఆశాజనకంగా ఉన్నప్పటికీ వర్షాలు లేక పంటలు ఎండిపోయాయి. చేసేది లేక ట్రాక్టర్‌తో ఎండిన పంటను దున్నివేశా. వర్షాభావంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంటనష్ట పరిహారం అందించాలి.

– హరినాథరెడ్డి, కొండ్రెడ్డిపల్లె

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

జమ్మలమడుగు : డిగ్రీ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజికి చెందిన విద్యార్థులు యూనివర్శిటీ టాపర్లుగా నిలిచినట్లు కాలేజి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం రెండు, నాలుగవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. అందులో బీఏకు చెందిన విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బీఏ ఎకనామిక్స్ విభాగంలో ఏ.మాధవి 9.67, చందు, చాందినీ, గౌరీమోహన్, సౌజన్య, ప్రమీల, హారికలు 9.33 గ్రేడ్ మార్కులు సాధించారన్నారు. నాలుగో సెమిస్టర్‌లో పి.ప్రియాంక 9.13, పవన్ 9.40 గ్రేడ్ సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పాఠశాల ప్రశ్న పత్రాలతోనే ఎఫ్ ఏ -1 పరీక్షలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఈనెల 24వ తేదీ నుండి జరగనున్న ఎఫ్ఏ-1 పరీక్షలు పాఠశాల స్థాయి ప్రశ్న పత్రాలు తోనే నిర్వహించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీలు సి వి ప్రసాద్ ,చంగల రెడ్డి, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర ,ఆలీ ఖాన్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల స్థాయిని బట్టి ప్రశ్నాపత్రాన్ని తయారు చేసే విధంగా విద్యాశాఖ అధికారులు అనుమతి ఇవ్వాలని కోరారు. వాట్సాప్ ప్రశ్నాపత్రాలకు స్వస్తి పలకాలని కోరారు. ముద్రణ ప్రశ్నా పత్రాలు సరఫరా చేయకపోవడం వల్ల గందరగోళం నెలకొందని తెలిపారు.

గండ్లూరు కాలనీలో వైద్య శిబిరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కమలాపురం : పట్టణంలోని తూర్పుగండ్లూరు శనివారం కాలనీలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం ఐదు మంది చిన్నాలు డెంగ్యూ బారిన పడ్డారు. ఐదు మంది చిన్నారులకు జ్వరాలు అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో శనివారం ప్రచురితమైంది. దీనికి స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కడప నుంచి వచ్చిన డాక్టర్ హీరేంద్ర సింగ్ పర్యవేక్షణలో సబ్ యూనిట్ ఆఫీసర్స్ లక్ష్మయ్య, ఎంవీవీ ప్రసాద్‌లు చిన్నారులతో పాటు నివాసితులకు పరీక్షలు నిర్వహించి డెంగీ, మలేరియా జ్వరాలు లేవని, కేవలం వైరల్ జ్వరాలు మాత్రమే ఉన్నాయని నిర్ధారించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేవలం వాతావరణంలోని మార్పుల వల్లనే వైరల్ ఫీవర్స్ ప్రబలాయన్నారు.

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. నిల్వ ఉన్న నీటిని పారబోసి మంచి నీరు పట్టుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన గండి



టికెట్ల క్యూలైన్లు సరిపడక ఆరు బయట వరుసలో నిలుచున్న భక్తులు

చక్రాయపేట : గండి అంజన్న పుణ్యక్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ముఖ్యంగా రూ.50, రూ.100 టికెట్ల క్యూలైన్‌లు సరిపడక భక్తులు ఆరు బయటనే వరుసగా నిలబడ్డారు. భక్తులకు స్వామి దర్శనం కోసం సుమారు 3 గంటల సమయం పట్టింది. పులివెందుల డీఎస్పీ మురళి, ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ రంగారావుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. చక్రాయపేట, వైద్యాధికారిణి వాణి, వైద్యశిబిరం నిర్వహించారు. కడప రిమ్స్ ఆధ్వర్యంలో ట్రిపుల్‌ఐటీ ప్రసాద్ పర్యవేక్షణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గండి ఉత్సవాల్లో పలువురు భక్తులు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. తొలి శనివారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. చక్రాయపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజరు సుదర్శన్ తమ సిబ్బందిచే టికెట్ల విక్రయం బాధ్యతలను చేపట్టారు. భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

స్తంభించిన ట్రాఫిక్

అంచనాలకు మించి భక్తులు రావడంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది. అద్దాలమర్రి క్రాస్ వద్ద నుంచి ఇడుపులపాయ క్రాస్ వరకు 3 కిలోమీటర్ల మేర ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్ సమస్య తీరేవరకు వాహనాలను గండిలోకి అనుమతించలేదు. దీంతో కొంత మేర భక్తులు ఇబ్బందులు పడ్డారు.

అంజన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రావణ మాసం తొలి శనివారం సందర్భంగా పలువురు ప్రముఖులు గండికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. డీఎంహెచ్‌వో నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ వైఎస్ఆర్‌సీపీ నేత సతీష్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

తాగునీటి సమస్యలేకుండా చూస్తాం

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యలు లేకుండా చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్.ప్రమోద్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన డీఈ బాలమల్లేష్‌తో కలిసి దొమ్మరనంద్యాల సమీపంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ క్లీనింగ్ పనులను పరిశీలించి మాట్లాడారు. పాత మోటార్‌ల స్థానంలో 8 కొత్త మోటర్‌లను బిగించామన్నారు. దొమ్మరనంద్యాల ఫిల్టర్ పాయింట్ వద్ద ప్రత్యేకంగా కాలువలను ఏర్పాటు చేశామన్నారు. వదిలిన నీరు నేరుగా దొమ్మరనంద్యాల గ్రామ వెలుపల ఉన్న శివారెడ్డినగర్‌లో కాకుండా కాలువల ద్వారా బయటికి వెళతాయన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. పట్టణంలో ప్రజలకు తాగునీటి సమస్య ఉంటే వెంటనే వారికి ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తారన్నారు. దోమల నివారణకు ఫాగింగ్‌తోపాటు కాలువల్లో అయిల్, బ్లీచింగ్ పౌడర్ చల్లే చర్యలను చేపట్టామన్నారు. ప్రజలకు తాగునీటి కోసం సరఫరా చేసే పైప్‌లైన్ పురాతనమైనది కావడంతో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు మున్సిపాలిటీ అభివృద్ధికి తమవంతు బాధ్యతగా సకాలంలో పన్నులను చెల్లించాలని సూచించారు.



దొమ్మరనంద్యాల ఫిల్టర్‌పాయింట్ వద్ద ఉన్న కొత్తమోటర్‌లను పరిశీలిస్తున్న కమిషనర్

ఘనంగా కామ్రేడ్ పొన్నతోట గంగమ్మ వర్ధంతి

సింహాద్రిపురం : జిల్లా కమ్యూనిస్టు పార్టీ అగ్రనిర్మాతలలో ఒకరైన కామ్రేడ్ పొన్నతోట వెంకటరెడ్డి భార్య కామ్రేడ్ పొన్నతోట గంగమ్మ 18వ వర్ధంతి వేడకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అంకాలమ్మగూడూరులో పొన్నతోట స్తూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత గంగాధరరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ మహిళా ఉద్యమం కోసం ఆమె చురుగ్గా పాల్గొన్నారన్నారు. అంకాలమ్మగూడూరు చరిత్రను చరిత్ర పుటలలోకి ఎక్కించిన ఘనత గంగమ్మకే దక్కుతుందన్నారు. కమ్యూనిస్టు కామ్రేడ్‌గా, మహిళా నాయకురాలిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పొన్నతోట సత్యప్రసాద్ రెడ్డి, సరళ, పోస్ట్ శివారెడ్డి, బీసీ నాయకులు, ఎస్సీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పొన్నతోట స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న గంగాధరరెడ్డి, తదితరులు

దాడి చేసిన నిందితులను శిక్షించాలి



కమలాపురంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న శరత్‌బాబు



పులివెందులలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు

కమలాపురం : విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శతర్‌బాబు డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఆయన శనివారం అంబేడ్కర్ విగ్రహంపై దాడిని నిరసిస్తూ స్థానిక క్రాస్ రోడ్డు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు.

రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే ఇప్పటికీ దేశంలో నడుస్తోందని గుర్తు చేశారు. ఆయన ఏ ఒక్క వర్గానికి చెందిన వ్యక్తి కాదని, అంబేడ్కర్ అందరి వాడన్నారు. అలాంటి మహనీయుని విగ్రహంపై దాడి చేసేందుకు వారికి చేతులు ఎలా వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల రక్షణ కోసం ప్రభుత్వం పాలన కొనసాగిస్తుంటే ముందుగా అంబేడ్కర్ విగ్రహం పై దాడి చేసిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ పట్ల ఇచ్చిన తీర్పును కూడా తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సుధీర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం

పులివెందుల రూరల్ : విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడి అమానుషమని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్పలు తెలిపారు. శనివారం పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వారు పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ హాల్ గంగాధరరెడ్డి, నూరు బాషా కార్పొరేషన్ మాజీ చైర్మన్ రసూల్, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లి కిశోర్, చంద్రమౌళి, ఎస్సీసెల్ నాయకులు కోళ్ల భాస్కర్, కృష్ణమూర్తి, సూరి, కౌన్సిలర్లు పురుషోత్తం, ఖాదర్, పద్మనాభరెడ్డి, కొండయ్య, రాజేష్‌నాయుడు, వైఎస్సార్సీపీ నాయకులు నాగరాజు, బ్యాటరీ ప్రసాద్, జశ్వంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం



మోట్నూతలపల్లెలో అబేట్‌ను పిచికారీ చేయిస్తున్న సిద్దయ్య

పులివెందుల రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న మోట్నూతలపల్లెలో శనివారం డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఇళ్ల ముందు ఉన్న నీటి తొట్లలో అబేట్ పిచికారీ చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. లార్వా నిర్మూలన కొరకు ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు.

సోమేశ్వరస్వామి దేవస్థానంలో వరలక్ష్మి వ్రతం

సింహాద్రిపురం : సౌరమానం ప్రకారం హిందూ సంవత్సరాదిలోని ఐదో నెల శ్రావణమాసం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైనది. మాసంలో ప్రతీరోజు పండగ అయితే శ్రావణమాసానికి పరిపూర్ణతను పరిపక్వతను తీసుకొచ్చింది శ్రీవరలక్ష్మీ వ్రతం. పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీ. శ్రీ మహావిష్ణువు దేవేరి అయిన మహాలక్ష్మి అష్టవిధ రూపాలతో సర్వమానవాళి కోరికలు తీరుస్తూ ఎళ్లవేళల రక్షిస్తుంది. 16వ తేదీ శుక్రవారం భానుకోట దేవస్థానంలో సుమంగళి స్త్రీలచే సామూహిక వరలక్ష్మి వ్రతం చెయ్యాలని భగవత్ సంకల్పం. భక్తులు ఈ వ్రతంలో పాల్గొని లక్ష్మి అనుగ్రహంతో సౌభాగ్యం ధనం, సంతానం, సంపద పొందగలరని ఆలయ అర్చకులు సురేష్ శర్మ, బద్రీశర్మలు తెలిపారు. వ్రతంలో పాల్గొనే వారు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని అర్చకులు తెలిపారు.

భవిష్యత్తుకు బాటలు వేసేలా బోధనలు

వైవీయూ: విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేలా బోధనలు చేయాలని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని నోడల్ రీసోర్స్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సెల్ అండ్ సీక్ శిక్షణ కార్యక్రమం ఆదివారం కొనసాగింది.

ప్రారంభమైన శ్రావణ మాసోత్సవం



తూర్పు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

పులివెందుల టౌన్ : శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో అంజన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. విద్యార్థులకు సెలవు కావడంతో ఆలయాల్లో భక్తుల రద్దీ నిండుగా కనిపించింది. పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి, పడమటి ఆంజనేయస్వామి, పేడబ్ల్యూ కాలనీ, కోతిసమాధి, తదితర ఆలయాల్లో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజలు, గోత్రనామాలతో అర్చనలు చేశారు. భక్తుల రద్దీని అదుపు చేసేందుకు ఆలయాల వద్ద ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని కాయకర్పూరాలు, నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

'మత్తు' పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవు



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

కమలాపురం : మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తప్పవని కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని వీధులతో పాటు క్రాస్ రోడ్డు వద్ద హైవే పైన ముమ్మరంగా ఆయన తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. ఎవరైన ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మత్తు పదార్థాల విక్రయానికి సహకరించిన వారిపై సైతం కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ కళ్యాణ్ దినకర్

లింగాల : హాస్టల్ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని లింగాల పీహెచ్‌సీ డాక్టర్ కళ్యాణ్ దినకర్ తెలిపారు. శనివారం స్థానిక ఎస్సీ హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆరోగ్యం బాగుండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పౌష్టికాహారం అవసరమన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, దీని వల్ల అటువ్యాధులు ప్రబలే అవ్రమాదం ఉందన్నారు. ఇందుకు వసతి గృహ సిబ్బంది దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కుసుమకుమారి, ఆశాబేగం, సీహెచ్‌ఓ శివరాం, హాస్టల్ వార్డన్ విక్టర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థలు సెలవు దినాల్లో కూడా పాఠశాలలను నిర్వహిస్తూ అటు విద్యార్థులను, ఇటు ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ శనివారం అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు సెలవు, కానీ నారాయణ విద్యా సంస్థలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రం సెలవు ఇవ్వలేదన్నారు. జిల్లాలోని బద్వేల్, ప్రొద్దుటూరు, రైల్వేకోడూరు, రాయచోటి బ్రాంచ్‌లలో పని చేసే ఉపాధ్యాయులందరినీ కడప కేంద్రంగా శనివారం వర్క్‌షాప్ నిర్వహించారని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.